ఈనాడు
యాదాద్రి భువనగిరి
ఆదివారం అక్టోబరు 6, 2024



చౌటుప్పల్‌లోని విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీగాయత్రి విద్యా సంస్థల్లో పూల పండుగ సందడి నెలకొంది. చౌటుప్పల్, న్యూస్‌టుడే:

అంతర్జాతీయ సదస్సుకు హాజరైన వైద్యులు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ వైద్య సదస్సు(జీ-స్పార్క్)కు జిల్లా నుంచి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని, టీబీహబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ అర్జున్, నర్సింగ్ అధికారి ప్రతిభ హాజరయ్యారు. వ్యాధుల కారణంగా వచ్చే ఇన్ఫెక్షన్ నివారణ, యాంటీమైక్రోబియాల్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సదస్సులో అవగాహన కల్పించినట్లు తెలిపారు. మూడురోజుల పాటు జరగనున్న సదస్సుకు వివిధ దేశాలకు చెందిన వైద్యరంగ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు హాజరైనట్లు వివరించారు.

బల్లాలు తుడిచి.. బతుకు బాటను మార్చి..!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:


సైదులు గౌడ్

నిరుపేద గీతకార్మిక కుటుంబం వారిది. జీవనోపాధి కోసం ఆరో తరగతిలోనే చదువు మానేసి, మద్యం దుకాణానికి అనుసంధానంగా ఉండే అనుమతి గదిలో బల్లాలు తుడిచే పనిలో చేరాడు ఆ కుర్రాడు. జీవితం, చదువు గొప్పతనాన్ని తెలుసుకుని దూర విద్యలో చదువు పూర్తి చేసి, నేడు అదే ఆబ్కారీ శాఖలో ఉద్యోగం సాధించాడు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కుక్కల సైదులుగౌడ్ తన జీవిత విశేషాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

పదోతరగతి 5, డిగ్రీలో 8 సార్లు అనుత్తీర్ణత

తల్లిదండ్రులు భిక్షం- ఎల్లమ్మ గీత కార్మికులుగా, రోజువారీ కూలీలుగా పని చేస్తుండేవారు. దీంతో కుటుంబ పోషణ కోసం ఆరో తరగతిలో చదువు మానేసి గ్రామంలోని మద్యం దుకాణంలో అనుమతి గదిలో రూ.300 నెలవారీ వేతనానికి పనిలో కుదిరాను. ఐదేళ్ల తర్వాత 2005లో దూర విద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరాను. పదో తరగతి 5 సార్లు, డిగ్రీలో 8 సార్లు ఫెయిల్ అయ్యాను. అదే సమయంలో మా కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీకి వచ్చిన తహసీల్దారు.. అర్హులైన వారికి పింఛన్లు వంటి వాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ సమయంలో నేనొక్కడినే రాయగలిగిన వాడిని కావడంతో వారి దరఖాస్తులన్నీ నింపి కార్యాలయంలో అందజేశాను.

★ నేను అందించిన దరఖాస్తుదారులకు కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యాయి. అప్పుడే నాకు గ్రూప్-2 ఉద్యోగం సాధించి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యానికి బీజం ఏర్పడింది. చదువు పూర్తి చేయాలనే ధ్యేయంతో సమీపంలోని మాశోతు తండాలో ఓ గది అద్దెకు తీసుకుని రెండు నెలల్లో డిగ్రీలో మిగిలిన 8 సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించాను. అనంతరం బీఈడీ సైతం పూర్తి చేసి, ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీసెట్ రాసి, ఎంఏ ఎకనామిక్స్‌లో 8వ ర్యాంకుతో సీటు సాధించాను. 68 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు లేకపోవడంతో మరోసారి పీజీ సెట్ రాస్తే 5 పీజీలలో 10లోపు ర్యాంకుల వచ్చాయి. లాసెట్‌లో 8వ ర్యాంకు వచ్చింది.

అమ్మకు క్యాన్సర్‌తో కుంగిపోయాను..

అమ్మ సర్వైకల్ క్యాన్సర్‌తో మృతి చెందడంతో కొంతకాలం కుంగిపోయాను. ఆ సమయంలో ఓ గదిని అద్దెకు తీసుకుని రేషన్ బియ్యంతో కాలం వెళ్లదీస్తూ, ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశాను. 2016లో గ్రూప్-2 పరీక్షల్లో 78 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకుతో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాను. 2019 నుంచి నాగర్‌కర్నూలు, కోదాడలో పని చేసి ప్రస్తుతం హైదరాబాద్ ధూల్‌పేటలో విధులు నిర్వర్తిస్తున్నాను.

★ తిండి కోసం నేను పడిన కష్టాలు ఇతరులు పడకూడదనే లక్ష్యంతో 'మన ఆపద్బాంధవులు ఫౌండేషన్'లో భాగస్వామినై రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. సుమారు నాలుగైదు వేల మందికి బియ్యం, నిత్యావసరాల పంపిణీ, ఇతర సహాయ కార్యక్రమాలు నిర్వహించాం.

చదువు విలువ తెలుసుకోవాలి:

చదువు విలువ నాకు ఆలస్యంగానైనా తెలిసింది. దీంతో చదువుపైనే దృష్టి సారించి, విజయాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో కృషి చేశాను. చదువే రాదనుకున్న నేను మొదట పదో తరగతిలో 42 శాతం, డిగ్రీలో 48 శాతం, బీఈడీలో 49శాతం మార్కులు సాధించాను. పీజీలో 68 శాతం, ఉద్యోగ పరీక్షలో 78 శాతం మార్కులు సాధించాను. తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదనడానికి నేనే పెద్ద ఉదాహరణ. సైకిల్ కొనుక్కునేందుకు నెలల తరబడి మద్యం దుకాణంలో పని చేసిన నేను, నేడు కారులో తిరుగుతుంటే ఎంతో గర్వంగా ఉంది. నా జీవిత చరిత్రను వివరిస్తూ యూట్యూబ్‌లో చేసిన వ్యక్తిత్వ వికాస తరగతులు మంచి ఆదరణ పొందాయి.

పొదుపు తెచ్చిన పండగ


మగ్గంపై వస్త్రం నేస్తున్న చేనేత కార్మికుడు

చౌటుప్పల్, న్యూస్‌టుడే:

చేనేత కార్మికులు పండగ పూట పస్తులుండకుండా నేతన్నకు చేయూత పథకంలో పొదుపు చేసుకున్న డబ్బును బ్యాంకుల నుంచి విడుదల చేయనున్నారు. ఈ పథకం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ వాటా బకాయిలను ఉమ్మడి నల్గొండ జిల్లాకు చేనేత, జౌళిశాఖ ద్వారా నెల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా సహాయ సంచాలకులు బ్యాంకులకు వెళ్లి పొదుపు ఖాతాల లెక్కలన్నీ సరి చూసి చేనేత కార్మికుల రికరింగ్ డిపాజిట్ ఖాతా-2ల్లో ప్రభుత్వ వాటా డబ్బును జమ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నిధుల విడుదలకు ఉత్తర్వులు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'నేతన్నకు చేయూత' పథకంలో 36 నెలల పాటు బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న ఒక్కో చేనేత కుటుంబానికి రూ. 2,80,400, వడ్డీ కూడా అందనున్నాయి. చేతినిండా పని లేక, నేసిన వస్త్రాలు అమ్మకాలు జరుగక ఇబ్బందులు పడుతున్న చేనేత కుటుంబాలకు ఈ డబ్బుతో కొంత వెసులుబాటు లభించనుంది. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ పథకాన్ని కొనసాగిస్తారా? అని చేనేత కార్మికులు ఎదురు చూస్తున్నారు. కొత్తగా రికరింగ్ డిపాజిట్ ఖాతాలు తెరిపించాలని ప్రభుత్వం ఉత్తర్వులు రాలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

○ చేతికందనున్న డబ్బు

ఆర్థిక భరోసా కల్పించే

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలని, వారిలో పొదుపు అలవాటును ప్రోత్సహించాలని భారాస ప్రభుత్వం నేతన్నకు చేయూత పథకాన్ని మూడేళ్ల కాలపరిమితితో భూదాన్ పోచంపల్లిలో 2017 జూన్ 24న ప్రారంభించింది. 2000 మే నెలలో పూర్తయింది. కరోనా రావడంతో మూడు నెలల ముందుగానే డబ్బు చేతికిచ్చారు. ఏడాది పాటు ఈ పథకాన్ని పునరుద్ధరించలేదు. చేనేత కార్మికులు విన్నవించుకోవడంతో అప్పటి ప్రభుత్వం రెండో విడత 2021 జులైలో ఈ పథకాన్ని ప్రారంభించారు. గడువు పూర్తి కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పది నెలల పాటు నిలిచిపోయిన ఖాతా-2 లలో ప్రభుత్వ వాటా డిపాజిట్లను ఒకే సారి జమ చేసింది. 2024 ఆగస్టు నెలతో ఈ పథకం మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. దీంతో రికరింగ్ ఖాతా-1, 2లు రద్దు చేసి వడ్డీతో సహా డబ్బును చేనేత కార్మికుల చేతికివ్వనున్నారు.

నేతన్నకు చేయూత పథకంలో లబ్ధిదారులు

యాదాద్రి	నల్గొండ	సూర్యాపేట
11,099	5,500	200

● జిల్లా ● చేనేత కార్మికులు

ఒక్కొక్కరికి వచ్చేది ఎంతంటే..

కార్మికులు	పొదుపు చేసుకున్నవి	ప్రభుత్వ వాటా	మొత్తం
మగ్గం నేసే కార్మికుడు	రూ.43,200	రూ.86,400	రూ.1,29,600
అనుబంద కార్మికుడు-1	రూ. 28,800	రూ.57,600	రూ. 86,400
అనుబంధ కార్మికుడు-2	రూ. 21,200	రూ.43,200	రూ. 64,400

కొనసాగించాలని కోరాం

– జి. బాలయ్య, 'ఆప్కో' మాజీ డైరెక్టర్, భువనగిరి



పొదుపు పథకాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రిని కోరాం. గత ప్రభుత్వం జియోట్యాగ్ నిబంధన విధించడం వల్ల చేనేత కార్మికులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోలేక పోయారు. పొదుపు డబ్బు మగ్గం నేసే కార్మికుడికి రూ. 1200, అనుబంధ కార్మికులకు రూ. 800, రూ. 600 అనే పరిమితి ఉండేది. దీనిని సవరించాలి. చేనేత కార్మికుల పొదుపునకు రెట్టింపు డబ్బును ప్రభుత్వం జమ చేస్తే చేనేత కుటుంబాల ఆర్థిక అవసరాలకు ఉపయోగపడుతుంది.

సమస్యలు పరిష్కరిస్తేనే ధాన్యం దించుకుంటాం


కలెక్టర్ హన్మంత్ కే.జెండగేకు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరిస్తేనే వానాకాలం సీజన్ సీఎంఆర్ ధాన్యం దిగుమతి చేసుకుంటామని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను శనివారం మధ్యాహ్నం అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు మార్త వెంకటేశంతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తాము మిల్లులను నడిపించే స్థితిలోలేమని స్పష్టం చేశారు. జిల్లా కార్యవర్గం సమావేశంలో చేసిన ఏకగ్రీవ తీర్మానం మేరకు తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టి తెస్తున్నామన్నారు. ఏటా గడువులోగా సీఎంఆర్ చెల్లిస్తున్నా ప్రభుత్వం ఏళ్ల తరబడి మిల్లింగ్ ఛార్జీలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. వెంటనే బకాయిలు చెల్లించడంతోపాటు పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, ఇతర వ్యయాలను దృష్టిలో పెట్టుకుని సీఎంఆర్ ఛార్జీలను చెల్లించాలని కోరారు. సీఎంఆర్ 60 శాతానికి కుదించాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్యను కలిసి వినతి పత్రం సమర్పించామని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు, మాజీ ప్రధాన కార్యదర్శి పసుపునూరి నాగభూషణం, సంయుక్త కార్యదర్శి జంగారెడ్డి, కోశాధికారి గౌరిశట్టి అశోక్, డైరెక్టర్ రామ్మోహన్ తదితరులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

ముగిసిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన

భువనగిరి పట్టణం: ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల ప్రక్రియ శనివారంతో ముగిసింది. పట్టణంలోని వెన్నెల కళాశాలలో ఈ ప్రక్రియ ఒకటో తేదీ నుంచి కొనసాగుతోంది. జిల్లాలో 277 ఎస్జీటీ, ఎస్ఏ పోస్టులు భర్తీకి ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున 672 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఆహ్వానించగా 627 మంది పరిశీలన ప్రక్రియకు హాజరయ్యారు. హాజరైన అభ్యర్థుల పత్రాలను అధికారులు పరిశీలించారు. కలెక్టర్ హన్మంత్ కె.జెండగే శనివారం కేంద్రాన్ని సందర్శించారు. వివరాలను డీఈవో సత్యనారాయణ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణతో పాటు పలువురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీటీ రహదారుల పనులు ప్రారంభం

బీబీనగర్, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ నిధులతో నాలుగు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. రూ.9.80 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ.2.10 కోట్లతో గొల్లగూడెం-అనాజీపురం బీటీ రోడ్డు, రూ.3.15 కోట్లతో సూరేపల్లి-చందుగానితండా, రూ.2.45 కోట్లతో ముగ్దుంపల్లి-రామునిగుండ్లాతండా, రూ.2.10 కోట్లతో చిన్నరావులపల్లి-సీనాతండా బీటీ రోడ్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామాంజనేయులు, పింగళ్‌రెడ్డి, శ్యామ్‌గౌడ్, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు


వైద్య సేవలు మెరుగయ్యేనా!

భువనగిరి గంజ్, భువనగిరి న్యూస్‌టుడే:

జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇచ్చింది. తాత్కాలికంగా భువనగిరి శివారులోని పాత కలెక్టరేట్ భవనాన్ని వైద్యకళాశాలగా ప్రారంభించనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 50 సీట్లతో తరగతులు ప్రారంభకానున్నాయి. కళాశాల అనుబంధంగా భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రి స్థాయిని వైద్యకళాశాల ఆసుపత్రిగా మార్చారు. రానున్న రోజుల్లో అత్యుత్తమ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రాసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా వైద్య విధాన పరిషత్తులో ఉండేది. జిల్లాలో వైద్య కళాశాలకు ప్రాథమిక అనుమతులు రావడంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి మార్చి వైద్యకళాశాల ఆసుపత్రిగా చేశారు.

స్పెషాలిటీ చికిత్సల కోసం..

జిల్లాలో ఏడున్నర లక్షల జనాభా ఉంది. జిల్లాలో ఎయిమ్స్ ఆసుపత్రి, ప్రస్తుతం ఉన్న జిల్లా కేంద్రాసుపత్రి మూడు సీహెచ్‌సీ ఆసుపత్రులు, 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు అందుతున్నాయి.


వైద్యకళాశాల ఆసుపత్రి

ముఖ్యంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలకు బోధనాసుపత్రి ప్రధానం కానుంది. ఇక్కడ స్పెషాలిటీ చికిత్సల కోసం రానున్నారు.

❖ ఎన్ఎంసీ నిబంధనల మేరకు వైద్యకళాశాలకు అనుబంధంగా ఉండే ఆసుపత్రిలో 220 పడకలు ఉండాలి. ఆ మేరకు పడకల సామర్థ్యం పెంపుచేసి వైద్యాధికారులు ఎన్ఎంసీకి నివేదికను అందజేశారు. అదనపు పడకల కోసం, బోధనాసుపత్రికి కావాల్సిన విభాగాలకు, చికిత్సలకు అవసమయ్యే వార్డులు, కావాల్సిన డిపార్టుమెంట్లు, వైద్య సేవలు, ఐసీయూ వార్డులను ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి వైశాల్యం ఏ మాత్రం సరిపోదు.

❖ బోధనాసుపత్రిలో 17 విభాగాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆయా విభాగాలకు అధిపతులు, సహాయ ఆచార్యులు ఉన్నారు. 59 మంది క్లినికల్ సిబ్బంది ఉన్నారు. గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్‌తో పాటు, ఇతర కీలక విభాగాలు అనుభవం ఉన్న వైద్యులు ఉన్నారు. క్లినికల్, నాన్‌క్లినికల్ సిబ్బందిని పొరుగు సేవల కింద నియమించారు.

❖ ఓపీ, ఇన్‌పేషెంట్ సేవలు, గైనిక్, చిన్నపిల్లల వార్డుల్లో, అత్యవసర సేవల విభాగంలో అనుభవం గల వైద్యులు ఉంటారు. అందువల్ల మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది.

❖ కళాశాల అనుబంధంగా ఆసుపత్రి ఉండటంతో కళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నిత్య పర్యవేక్షణలో కొనసాగనుండటం వల్ల సేవల్లో జాప్యం, విధుల్లో నిర్లక్ష్యం లేకుండా కొనసాగుతుంది.

జిల్లాలో నలుగురు తహసీల్దార్ల బదిలీ

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని వారిని ఆదేశించారు. భువనగిరి, పోచంపల్లి, ఆలేరు తహసీల్దార్లను బదిలీ చేయడంతో పాటు సెలవుల్లో ఉన్న కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

తహసీల్దారు పేరు	ప్రస్తుత పోస్టింగ్	బదిలీ స్థానం
పి. శ్రీనివాస్‌రెడ్డి	ఆలేరు	సూపరింటెండెంట్ కలెక్టరేట్
ఎన్. అంజిరెడ్డి	బీబీనగర్	తహసీల్దార్ ఆలేరు
బి. శ్రీకాంత్‌రెడ్డి	పోచంపల్లి	తహసీల్దార్ భువనగిరి
బి. మహేందర్‌రెడ్డి	కలెక్టరేట్	తహసీల్దార్, పోచంపల్లి

ఐటీఐలలో ప్రవేశాలకు ఆహ్వానం

భువనగిరి పట్టణం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమానంద్ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 9లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న తదుపరి ఎంపిక చేసుకున్న ఐటీఐకి ఈ నెల 9న ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

వలిగొండ, న్యూస్‌టుడే: వలిగొండ-రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వలిగొండ మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూక్యా భీమానాయక్, వైస్ ఛైర్మన్‌గా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డిని నియమిస్తూ వ్యవసాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుండు దానయ్య, జక్కా దామోదర్‌రెడ్డి, రాచమల్ల తిరుపతయ్య, జూకంటి శివ్వమ్మ, ఉక్కుర్తి చంద్రయ్య, బొని యాదయ్య, గగ్గేనపల్లి నరేందర్‌రెడ్డి, దిండిగల్ల సత్తయ్య, కోమటి లింగస్వామి, పెద్దగోని వెంకటేశం, తవుటం నరహరి, నాగెల్లి కృష్ణమూర్తిని సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.


భూక్యా భీమానాయక్


సిరిగిరెడ్డి మల్లారెడ్డి

సరికొత్త క్యాంటీన్లు


క్యాంటీన్ ఏర్పాటు ప్రతిపాదించిన జిల్లా కలెక్టరేట్‌లోని స్వయం ఉత్పత్తుల కేంద్రం (మన ఉత్పత్తులు.. మన గౌరవం భవనం)

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ

భువనగిరి, న్యూస్‌టుడే:

మహిళా శక్తి కార్యక్రమాల అమలులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తొలి విడతగా మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. క్యాంటీన్లు నడిపేందుకు ముందుకు వచ్చే మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తారు. తొలుత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముఖద్వారం పక్కన స్వయం ఉత్పత్తుల కేంద్రాన్ని ఎంపిక చేశారు. మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువులు, పండించిన కూరగాయలు, చిరుధాన్యాలను ఈ కేంద్రంలో విక్రయించేవారు. మన ఉత్పత్తులు, మన గౌరవం అనే పేరుతో భవనానికి నామకరణం చేశారు. ఇది విజయవంతం కాకపోవడంతో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ సంకల్పించింది. భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘానికి బాధ్యత అప్పగించారు. ఈ మేరకు ఇటీవల సంఘ సభ్యులు ముగ్గురు శిక్షణ పొందారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం హాస్పిటాలిటీ సంస్థ(నీతంలో) శిక్షణ పొందారు. ఉత్పత్తుల కేంద్రంలో క్యాంటీన్ నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దే పనులు ప్రారంభించారు. రోజు 60 భోజనాల వరకు విక్రయమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అల్పాహారం, టీ కూడా విక్రయిస్తారు.

ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లోనూ..

మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్న నేపథ్యంలో వారికి ఇష్టమున్న రంగాల్లో ఉపాధి చూపేందుకు మహిళ శక్తి కింద చేయూతనిస్తున్నారు. ఈ ఏడాది ఈవెంట్ నిర్వహణలోనూ శిక్షణ ఇప్పించాలని సంకల్పించారు. మూడు సంఘాలు ముందుకు వచ్చిన బీబీనగర్ వీవోకు4ను ఎంపిక చేశారు. ఎంబీఏ పూర్తి చేసిన శ్రీవెంకటేశ్వర మహిళా సంఘ సభ్యురాలు కె.విజయలక్ష్మీని ఎంపిక చేశారు. పది మంది సభ్యులకు కూడా శిక్షణ ఇస్తారు. రూ.32 లక్షల పెట్టుబడిని బ్యాంకు రుణం ద్వారా సమకూర్చుతారు.

మరో రెండు

యాదగిరిగుట్ట, ఆలేరు ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అక్కడ ఏ మేరకు నడుస్తాయో అధ్యయనం చేస్తున్నారు. ఆలేరుకు సంబందించి నిర్వహణ కోసం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ను ఎంపిక చేశారు. ఇటీవల వారు కూడా నీతంలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. యాదగిరిగుట్టలో ఎంపిచేసిన మహిళా సంఘ సభ్యులకు శిక్షణ ఇప్పించాల్సి ఉంది.

ఔత్సాహికులకు శిక్షణ ఇస్తాం

– టి.నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి భువనగిరి

మహిళల స్వయం సమృద్ధి కోసం మహిళా శక్తి కింద చేపట్టిన కార్యకలాపాలు విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టరేట్‌లో క్యాంటీన్ ఏర్పాటు ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. త్వరలో ప్రారంభిస్తాం. పెట్టుబడికి ఇబ్బంది లేకుండా బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తాం. కొత్త ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు మహిళా సంఘాలకు బాధ్యత అప్పగిస్తాం.

సన్మార్గంలో నడిపేందుకు..!



కొయ్యలగూడెంలోని ఆశ్రమం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మానవ జన్మ గొప్పతనాన్ని వివరించి ప్రజల్ని సన్మార్గంలో నడిపేందుకు, సత్కర్మలు నిర్వహించేలా ప్రోత్సహించేందుకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో శ్రీ శివరామ దీక్షిత అవధూత సంప్రదాయక రాజయోగ ఆశ్రమాన్ని 2003లో స్థాపించారు. 21 ఏళ్లుగా ఆశ్రమ అధిపతులు 'సుజ్ఞాన వివేకానంద' వర్మాల సత్యనారాయణ, 'శ్రీగురు కరుణానంద' భోగ మాధవులు ఆధ్వర్యంలో నాటి, నేటి తరాన్ని ఆకట్టుకునేలా కుల, మత భేదం లేకుండా ఈ ఆశ్రమంలో జ్ఞాన బోధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతి సమస్యకు పరిష్కారంగా భగవద్గీత ఎలా ఉపయోగపడుతుందో వివరిస్తున్నారు. ఆనందంగా ఉండాలంటే ఆరోగ్యంగా ఉండాలని, దాని కోసం నిత్యం యోగ, ప్రాణాయామ సాధన చేయిస్తున్నారు. పౌర్ణమి రోజున సత్సంగం, గురు పాదుకాపూజ నిర్వహించడంతో పాటు హాజరైనవారందరికీ భోజనం పెడుతున్నారు. ఏటా వార్షిక ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



సత్యనారాయణ రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలు

ఆశ్రమంలో బోధనాంశాల సారం...

◆ దేవుడు ఎక్కడో లేడు. దయగల హృదయంలో కొలువై ఉన్నాడు. జీవుల పట్ల దయతో మెలగాలి.

◆ సదాచారం, సత్ప్రవర్తన, గాయత్రి మహా మంత్ర జపం, ఈశ్వరోపాసన, సత్సాంగత్యం, సత్య సహవాసం, శీలం, సదాచారంతో జీవించాలి. వాటితో హృదయం శుద్ధి అవుతుంది.

◆ అన్ని జీవులలోకెల్లా మానవ జన్మ ఉత్తమమైంది. సాధన చేసుకోవడం, ఆధ్యాత్మికమయమైన జీవితానికి గురువు అవసరం.

◆ తల్లి తొలి, విద్య నేర్పినవారు రెండో గురువు. జీవిత పరమార్థాన్ని తెలిపి, జ్ఞానజ్యోతిని వెలిగించే సద్గురువును ఆశ్రయించాలి.

◆ జగత్తు అంటే భూమి, ఆకాశం, గాలి, అగ్ని, నీరు. మానవదేహమూ ఈ పంచభూతాలున్నాయి. ఈ పంచభూతాల అధిష్ఠాన దేవత ఒక్కరే, పరమాత్మ.

◆ ప్రతి స్త్రీ తన జాతిని గౌరవించే విధంగా తమ సంతానాన్ని పెంచాలి.

భగవద్గీత విని ప్రభావితులవుతున్నారు..


– 'సుజ్ఞాన వివేకానంద' వర్మాల సత్యనారాయణ



నా గురువులు తిరువీదుల బాపనయ్య, కొండోజు బ్రహ్మానంద. వారి బోధనలను గ్రామ ప్రజలకు వివరించేందుకు ఆశ్రమాన్ని నెలకొల్పాం. గత నలభై ఏళ్లుగా భగవద్గీత ప్రబోధం చేస్తున్నా. సత్సంగంలో భాగవతం, గరుడ పురాణం సైతం వివరిస్తున్నాం. ప్రజలకు అర్థమయ్యేలా విజ్ఞాన రాజయోగ సారామృతం, గురు బోధామృతం, దైవ ప్రార్థన, భగవద్గీత సారామృతం, నిత్య ప్రకాశిక రచించి పంపిణీ చేస్తున్నాం. 180 మంది శిష్యులుగా చేరారు.

చేసే కర్మలోనే భగవంతుడు

– శ్రీగురు కరుణానంద భోగ మాధవులు



నిష్కామకర్మ చేయాలని, అహంకారం ఉండకూడదని, చేతనైనంత ధర్మం చేయాలని, ఇతరులకు కష్టం కల్పించకూడదని, జ్ఞానం పెంపొందించుకోవాలని, మనం చేసే కర్మలోనే భగవంతుడున్నాడని ఆశ్రమంలో నిత్యం సత్సంగంలో బోధిస్తున్నాం. ఆరోగ్యం కోసం యోగా, ప్రాణాయామం చేయిస్తున్నాం. నాకు వంద మందికి పైగా శిష్యులుగా మారారు. సన్మార్గంలో నడుస్తూ మిగితా వారిని ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజలు ధర్మ మార్గంలో నడిస్తేనే మానవ జీవితానికి సార్థకత.

బోధన ప్రణాళిక ఇలా...

సోమ, మంగళవారాలు: ప్రాణాయామం, యోగ సాధన

గురు, శుక్ర, శని, ఆదివారాలు: వివిధ అంశాలపై సత్సంగం

ప్రతి పౌర్ణమి రోజు: గురు పాదుకాపూజ, అన్నప్రసాదం వితరణ

ప్రతి ఏడాది: ఆశ్రమ వార్షికోత్సవం, సత్కారం

పూదోట.. బతుకుబాట



హుజూర్‌నగర్-కోదాడ రహదారి వెంట వేసిన బంతి తోట

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: భూమి లేదు కాని రైతు అయ్యాడు. ఉపాధిని వెతుక్కుంటూ ఖాళీ స్థలాల్లో పూల తోటలు వేసి జీవనానికి బాట వేసుకున్నాడు హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలోని మర్రిగూడెంకు చెందిన ఎస్‌కే అహమ్మద్. హుజూర్‌నగర్ శివారులో ఖాళీగా ఉన్న స్థలాలను కౌలుకు తీసుకుని బంతి, గులాబీ పూల తోటలు వేసి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో మంచి డిమాండ్ ఉంది. అన్ని కాలాల్లోనూ పూలు లభించేలా రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని బంతితో పాటు పూల తోటలు వేసి అంతర పంటలుగా కూరగాయలు సాగు చేస్తున్నారు. గతంలో పూల తోట వేయక ముందు బొప్పాయి తోట, కూరగాయలు వేశారు. కానీ పెద్దగా లాభం కన్పించక పోవటంతో పూల సాగు చేస్తున్నారు. 75 రోజులలో బంతి పూలు పూస్తాయి. వీటికి కూడా చీడపీడలు వస్తుంటాయి. ఇతర పంటలతో పోల్చితే తక్కువే.

❑ మొక్కలను ఏపీలోని వివిధ ప్రాంతాలలోని నర్సరీల్లో కొనుగోలు చేసి తీసుకు వచ్చి నాటుతారు. ఎకరానికి దాదాపు రూ.12 వేల విలువ చేసే మొక్కలు నాటుతున్నట్లు **అహమ్మద్** తెలిపారు. బంతిపూలు ఎకరంలో, ఎకరన్నర భూమిలో గులాబీ మొక్కలు సాగు చేస్తున్నారు. గులాబీ మొక్కలు ఒకసారి నాటితే పూస్తుంటాయి. ఒకసారి పూల పంట చేతికందిన తరువాత వాటి కొమ్మలు కత్తిరించి మళ్లీ శుభ్రం చేస్తే అవి తిరిగి పూస్తాయి. ఈలోగా వాటిలో అంతర్ పంటగా బంతి, కనకాంబరాలు తదితర చిన్న చిన్న పూలు వేసుకుంటే ఆదాయం వస్తుందని అంటారు అహమ్మద్. ఏటా అన్ని ఖర్చులు పోను దాదాపు రూ.2.50 లక్షల ఆదాయం ఉంటుందని తెలిపారు. భూమి కౌలుకు తీసుకోవడం వల్ల ఖర్చు ఎక్కువ వస్తుంది కానీ లేకపోతే పూల సాగు బాగా లాభదాయకం అని చెబుతున్నారు.



ట్రస్టు సేవ.. విద్యాభివృద్ధికి తోవ



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ట్రస్టు కన్వీనర్ లచ్చయ్య (పాతచిత్రం)

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో అరబండి రామచంద్రయ్య, కనకదుర్గమ్మ ట్రస్టు విద్యాభివృద్ధి తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తమ గ్రామంలోని పేద విద్యార్థులకు సేవలందించడం లక్ష్యంగా వారి కుటుంబీకులు ట్రస్టు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దగా ఉన్న వల్లంశెట్ల లచ్చయ్య ఈ ట్రస్టు కన్వీనర్‌గా ఉండి సేవలందిస్తున్నారు. ట్రస్టు ద్వారా సేవాకార్యక్రమాల నిర్వహణకు రూ.12 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే వడ్డీని చదువులో ప్రతిభ చూపే పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతుల కోసం వెచ్చిస్తున్నారు. జాతీయ పండగలైన ఆగస్టు 15, జనవరి 26న ఏటా విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నారు. దీని కోసం ఏటా రూ.66 వేలు వెచ్చిస్తున్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.30 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించారు. ఐదారేళ్ల కిత్రమే గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సౌరవిద్యుత్తు కోసం రూ.1.60 లక్షల దాకా వెచ్చించారు. పాఠశాలలో ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ట్రస్టు ద్వారా సాయం అందిస్తున్నారు.

దసరా తర్వాత డిగ్రీ కళాశాలల బంద్



రిజిస్ట్రార్ అల్వాల రవికి వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, తదితరులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దసరా సెలవుల అనంతరం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్ చేపడుతున్నట్లు తెలంగాణ గుర్తింపు పొందిన డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం పేర్కొంది. ఆ సంఘం ప్రతినిధులు శనివారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అల్వాల రవికి సమస్యలతో కూడిన బంద్‌కు సంబంధించిన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. అప్పులు తెచ్చి భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. నిధులు లేనప్పుడు విద్యార్థులకు విద్యాపరంగా ఏ విధంగా న్యాయం చేయగలుగుతామని తెలిపారు. దసరా సెలవుల లోపు ప్రభుత్వం బకాయిలు చెల్లించకుంటే కళాశాలల బంద్ కార్యక్రమం తప్పనిసరిగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి సైదారావు, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

బుద్ధవనం సందర్శించిన బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్‌లోని బుద్ధ వనాన్ని అశోక, అంబేడ్కర్ దమ్మ యాత్ర బృంద సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ బుద్దిస్ట్ సొసైటీ కౌన్సిల్ పూజ్య మార్య బౌద్ధ భిక్షు భారతీయ ప్రభు మాట్లాడుతూ ప్రపంచ శాంతి, బంధుత్వాన్ని కోరుతూ నిర్వహిస్తున్న ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుంచి నాగ్‌పూర్‌లోని దీక్ష భూమి చేరుకుని, అక్కడ అశోక విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బుద్ధ వనంలో ఈ బృందం బుద్ధ పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరిత వనం, జాతక పార్కు, అవకాన బుద్ధుని విగ్రహం, స్తూప పార్కు తదితర ప్రాంతాలను తిలకించారు. ఈ యాత్రలో దమ్మ కమిటీ సభ్యులు ధర్మేంద్రన్, రాజేంద్రన్, రాజగోపాల్ తదితరులు ఉన్నారు.



బుద్ధ పాదుకల వద్ద బౌద్ధ భిక్షువులు

నారసింహుడి జన్మ నక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. ఆలయ దేవుడు నరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా గర్భగుడిలో వెలసిన మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో కలశ పూజ నిర్వహించారు. నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ పర్వాన్ని కొనసాగించారు. సాయంత్రం అలంకార సేవా పర్వాన్ని మంగళవాయిద్యాల మధ్య జరిపారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ స్వాతి ఆరాధనలు నిర్వహించారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.



స్వాతి నక్షత్రం వేడుకల్లో భాగంగా జరిపిన స్వర్ణ కలశపూజ

అంబరాన్నంటిన సంబరం.. అలరించిన రూపకం



కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తొమ్మిది అవతారాలను విద్యార్థినులు అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిషాసుర మర్దిని రూపకం అందరినీ అలరించింది. – న్యూస్‌టుడే, కోదాడ పట్టణం

65 కిలోల బంగారంతో.. స్వర్ణమయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రీశుల స్వర్ణ విమానానికి 65 కిలోల బంగారం కావాలి. ఇప్పటి వరకు దాతల నుంచి విరాళాల ద్వారా పదకొండు కిలోల బంగారం, రూ.20 కోట్ల నగదు చేకూరాయి. అవసరమైన బంగారం సమకూర్చి ప్రభుత్వ సూచన మేరకు అతి త్వరలోనే స్వర్ణ విమానం రూపకల్పన పనులు చేపడతామని ఆలయ ఈవో భాస్కర్‌రావు శనివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దాతల సహకారంతో చేకూరిన నగదు, బంగారం కాకుండా కావాల్సిన బంగారాన్ని తమ దేవస్థానం సమకూర్చేందుకు సిద్ధమని ఈవో వెల్లడించారు. ఆలయ హుండీల ద్వారా 1300 కిలోల వెండి, నగల రూపంలో వచ్చిన బంగారం ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటిని బంగారు విమాన గోపురం తయారీకి వినియోగిస్తామని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారమే చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు స్వర్ణ తాపడం పనులు కమిటీ సమక్షంలో అప్పగిస్తామన్నారు.



స్వర్ణమయంగా మారనున్న యాదాద్రి ఆలయ విమానం

విమానం స్వర్ణమయం చేసేందుకు కూలి పనులకు రూ.3.90కోట్లు అవసరం. ఆ మొత్తాన్ని దేవస్థానం చెల్లిస్తుందన్నారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ దసరాలోపు సమావేశం కానుంది.

* గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన క్షేత్రాభివృద్ధిలో సంపూర్ణంగా కృష్ణశిలతో పంచ నారసింహులు కొలువై ఉన్న దేవాలయాన్ని పునర్నిర్మించారు. అప్పుడే గర్భాలయం పై దివ్య విమానాన్ని బంగారు కవచాలతో రూపొందిస్తామని ప్రకటించారు. పనులు రాగి తొడుగుల వరకే పరిమితమైంది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతితో, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సదరు పనులు నిమిత్తం బంగారాన్ని సమకూర్చి అప్పగించేందుకు కసరత్తు చేస్తోంది.

పెరట్లో గంజాయి పెంచుతున్న వ్యక్తి అరెస్టు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: రాష్ట్రమంతా గంజాయి నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగం పరుగులు తీస్తున్నా.. ఓ వ్యక్తి మాత్రం నిర్భయంగా ఎవరూ పట్టించుకోరులే అని తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు నాటి చక్కగా పెంచుతున్నాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా పోలీసులకు చేరింది. ఇంకేముంది పోలీసులు చడీచప్పుడు లేకుండా సదరు ఇంటికి వెళ్లి చూడగా 18 కిలోల గంజాయి మొక్కలు సాగు చేస్తూ దొరికిపోయాడు. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం బుడ్డరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సింగం ముత్యాలు తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. విశ్వసనీయ సమాచారంతో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ తన సిబ్బందితో పాటు వ్యవసాయ అధికారి మాధవరెడ్డితో కలిసి శనివారం మధ్యాహ్నం సింగం ముత్యాలు ఇంటిని పరిశీలించారు. పెరట్లో 125 గంజాయి మొక్కలు (సుమారుగా 17.5 కిలోలు) ఉన్నట్లు కనుగొన్నారు. ఆకులు ఎండిపోతే 2 నుంచి 3 కిలోలు అవుతుందని, దాని విలువ రూ.50 వేలకు పైనే ఉంటుందని తెలుస్తోంది. పంచనామా చేసి మొక్కలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణరెడ్డి తెలిపారు.



ముత్యాలు ఇంట్లో పెంచుతున్న గంజాయి మొక్కలు

కారు బోల్తాపడి వ్యక్తి దుర్మరణం

మద్దిరాల, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో జాతీయ రహదారి-365పై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన బోర్‌వెల్ యజమాని బత్తిని రవీందర్‌గౌడ్(55) తన కారులో మరో ముగ్గురితో కలిసి నుండి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రెడ్డిగూడెం శివారులో వర్షం కురవడంతో కారు అద్దాల్లోంచి దారి కనిపించక వాహనం అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కారు నడుపుతున్న బత్తిని రవీందర్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు స్వల్పగాయాలతో బయట పడ్డారు. బోల్తా పడిన కారును క్రేను సహాయంతో పోలీసులు బయటకు తీసి మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

ఆలేరు, న్యూస్‌టుడే: నాన్నమ్మ నెల మాసికం ముగించుకుని వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన శనివారం ఆలేరులో జరిగింది. స్థానిక ఎస్సై రజనీకర్, గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజపేట మండలం సోమారం గ్రామానికి చెందిన తమ్మడి హరిగణేశ్(30) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటున్నాడు. డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాన్నమ్మ నెల మాసికం ఉండటంతో శుక్రవారం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఉప్పల్‌కు తిరుగు పయనమయ్యాడు. ఆలేరు సాయిబాబా గుడి సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి చేరే క్రమంలో .హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతున్న ఆర్టీసీ గరుడ బస్సు బలంగా ఢీకొట్టింది. హరిగణేశ్ తలకు గాయమైంది. 108 అంబులెన్స్‌లో ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చిన కొద్దిసేపటికే మృతి చెందాడు. తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆర్టీసీ బస్సు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై చెప్పారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు: ఎమ్మెల్యే కుంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: విద్యతోనే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గౌతమి పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరై ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రావుల జంగయ్య, సామ మధుసూదన్‌రెడ్డి, పాక మల్లేశం, భారత లవకుమార్, ఉప్పు నూతల వెంకటేశం పాల్గొన్నారు.

దుర్గాదేవి పూజల్లో .. బీబీనగర్, న్యూస్‌టుడే: భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీబీనగర్ పట్టణంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

పల్లె దారులు అధ్వానం



వలిగొండ: గుర్నాథ్‌పల్లి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇలా..

వలిగొండ, న్యూస్‌టుడే: వలిగొండ మండలంలో దుప్పల్లి, గురున్నాథ్‌పల్లి, వేములకొండ నుంచి చిత్తాపురం గ్రామాలకు మట్టి రోడ్లు ఉండటంతో వర్షాకాలంలో గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

☛ లోతుకుంట నుంచి గుర్నాథ్‌పల్లి వరకు, వేముల కొండ నుంచి చిత్తాపురం వరకు ఉన్న మట్టి రోడ్డుకు గుంతలు ఏర్పడ్డాయి. గోపరాజుపల్లి స్టేజీ నుంచి దుప్పల్లి వరకు బీటీ రోడ్డు లేదు. వర్షాలు కురిసినప్పుడు మట్టి దారిన నడిచే పరిస్థితి లేదు.

☛ అరూర్ స్టేజీ నుంచి ఆత్మకూర్ మండల కేంద్రం వరకు బీటీ రహదారి దెబ్బతిని రాత్రి సమయంలో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ అరూర్ నుంచి వెలువర్తి నుంచి కేర్చిపల్లి గ్రామం మీదుగా పులిగిల్ల వరకు ఉన్న బీటీ రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. వలిగొండ నుంచి కాటేపల్లి వరకు, వేములకొండ స్టేజీ నుంచి రామన్నపేట మండలం లక్ష్మాపురం వరకు దారి అధ్వానంగా మారింది. రాఘవపురం స్టేజీ నుంచి దుప్పల్లి వరకు రెండు కిలోమీటర్లు దూరం బీటీ రోడ్డు గతుకుల మయమైంది.

ఉన్నతాధికారులకు నివేదించాం
- సందీప్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, వలిగొండ

మండలంలో గురున్నాథ్‌పల్లి నుంచి లోతుకుంట వరకు మట్టి రోడ్డును బీటీగా మార్చాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కంకర తేలిన రహదారులకు మరమ్మతులు చేసేలా అధికారులకు చెప్పాం. వలిగొండ నుంచి సుంకిశాల మీదుగా కాటేపల్లి వరకు ఉన్న రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలోకి ఉందని ఏఈ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

తుర్కపల్లి, న్యూస్‌టుడే:

? తిర్మలాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. మౌలిక వసతులు లేక పిల్లలు, తల్లులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. - నర్సింహులు, తిర్మలాపురం.

✓ సొంత భవనాల కోసం ప్రతిపాదనలు పంపించాం. - పర్యవేక్షకురాలు, విజయరాణి.

సంక్షిప్త సమాచారం

విద్యుత్తు తీగలు చోరీ.. రామన్నపేట: ఇంద్రపాలనగరంలో పలువురు రైతులకు చెందిన విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావుల వద్ద మోటార్లకు చెందిన కేబుళ్లను కత్తిరించి అపహరించారని పలువురు రైతులు పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ.. గుండాల: మండల కేంద్రంలో మిషన్ భగీరథలో పని చేస్తున్న సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. నీటి నిర్వహణ, లీకేజీలపై తగిన శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ కరుణాకర్, ఏఈ ఆనంద్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడి కన్నుమూత.. రాజపేట: మండలంలోని నెమిల గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు సుంకరి భద్రప్ప శనివారం మరణించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, మండల కార్యదర్శి దీగల్ల లింగం, యాదగిరిగుట్ట మండల కార్యదర్శి పల్లెర్ల మహేందర్, చెరుకుపు రామస్వామి, వేదాటి శ్రీదేవిలు హాజరై సంతాపం తెలిపారు.

పెరిగిన ధరలు తగ్గించాలి.. ఆత్మకూరు(ఎం): నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్ ధరలు సత్వరమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గినా కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఇంధనాల ధరలు తగ్గించకపోవడంతో ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక భారం పడుతోందన్నారు. కూరెళ్లలో శనివారం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా టి.యాదయ్య, సహాయ కార్యదర్శి జె.రమేశ్, సభ్యులుగా బి.బీరయ్య, ఎ.సోమయ్య, ఎన్.మల్లయ్య, కె.అంజయ్య, కె.నాగయ్య, ఎ.యాదయ్య, కె.మల్లయ్య, పి.అండమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సర్వేకు సహకరించాలి.. భువనగిరి పట్టణం: పట్టణంలోని 15వ వార్డులో ప్రయోగాత్మకంగా చేపడుతున్న డిజిటల్ కార్డుల సర్వేకు ప్రజలు సహకరించాలని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. 15వ వార్డులో చేపడుతున్న సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు బహుళ ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజులరెడ్డి, కౌన్సిలర్ నాజియా రహ్మాన్, నాయకులు జహంగీర్, కిరణ్, సాయి, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేరుసెనగ సాగుపై మెలకువలు.. భువనగిరి గ్రామీణం: భువనగిరి మండలం చందుపట్లలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎరువాక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వేరుసెనగ సాగు మెలకువలపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి వనరుల వినియోగం, అధిక దిగుబడికి పాటించాల్సిన అంశాలను రైతులకు ఎరువాక శాస్త్రవేత్త మమత వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీ సమస్యలు పరిష్కరించాలి

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పురపాలిక పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో తాగునీరు సరిగా రావడం లేదని, వీధిదీపాలు వెలగడం లేదని, పందులు, కోతుల బెడద ఎక్కువైందని స్థానికులు తెలిపారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ ఆ కాలనీ అధ్యక్షుడు పోల్లెపల్లి నరేష్, వెంకన్న శనివారం పుర అధ్యక్షురాలు గుర్రం కవిత, ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కాలనీవాసులు అమరేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్, శ్రీను, వెంకన్నగౌడ్, నర్సయ్య, సోమేశ్వర్, అంజయ్య, మల్లేశం పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైనవి: ఎస్ఈ



గ్రామీణ మంచినీటి సహాయకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ఎస్ఈ, ఈఈ, ఎంపీడీవో, తదితరులు

మోత్కూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎన్నో ప్రయాసలకు ఓర్చి నీటిని శుద్ధిచేసి గ్రామాలకు సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ జలాలు ఎంతో స్వచ్ఛమైనవని, ఆ నీటిని తాగడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య అన్నారు. నాలుగు రోజులుగా తాగునీటిపై శిక్షణ పొందిన గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణ పూర్తి అయిన సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్న ఆర్వో ప్లాంట్ల నీరు, బాటిళ్లలో లభించే తాగునీటి కన్నా మిషన్ భగీరథ నీరు ఎంతో ఉత్తమమైనవన్నారు. భగీరథ నీరు ఎందుకు స్వచ్ఛమైనదో పరీక్షల ద్వారా రుజువు చేసిన విషయాలను ప్రజలకు వివరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కరుణాకర్ సూచించారు. శిక్షణ పొందిన సహాయకులకు గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిరంజన్ వలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, టీవోటీ రాజన్న పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ నుంచే రాజపేటకు సాగునీరు : సునీత

రాజపేట, న్యూస్‌టుడే : మల్లన్నసాగర్ జలాలు రాజపేట మండలానికి అందించే అవకాశం ఉందని, ప్రస్తుత నాయకులు ఆ దిశగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తెలిపారు. మండలంలోని జాల గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి మరణించినందుకు, కుర్రారం గ్రామానికి చెందిన జూకంటి ఐలయ్య, రాజపేట జెడల చంద్రశేఖర్ కుటుంబాలను శనివారం పరామర్శించారు. అనంతరం స్థానికంగా విలేకరుల సమావేశంలో గొంగిడి సునీత మాట్లాడారు.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రూపకల్పనలో మల్లన్నసాగర్ నుంచి వస్తున్న 15వ ప్యాకేజీ కాల్వ ద్వారా గంధమల్ల కాల్వకు టీ జంక్షన్ ఇచ్చే నిర్ణయం గతంలో జరిగిందని, ఈ మేరకు సుమారు 19 కిలోమీటర్ల కాల్వ తవ్వే విషయమై అప్పట్లో డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించామన్నారు. కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, సందిల భాస్కర్ గౌడ్, వెంకట్రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, ఉప్పలయ్య, రాజు, బాలస్వామి పాల్గొన్నారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి

భువనగిరి: దేశం, రాష్ట్రానికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, కె.గంగాధర్ అన్నారు. ఆయన 95 జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, డీపీవో సునంద, కలెక్టరేట్ ఏవో జగన్మోహనప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జి.వెంకటస్వామి జయంతి పురస్కరించుకుని నివాళులు అర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు కె.గంగాధర్, పి.బెన్ షాలోమ్, జిల్లా అధికారులు

తుర్కపల్లి : జి.వెంకటస్వామి జయంతిని మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సురేశ్, ఎంపీడీవో ఝాన్సీలక్ష్మిబాయి, ఏపీవో నర్సయ్య, ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా తహసీల్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఎం పక్కీరయ్య, కార్యాలయ సిబ్బంది నరేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

రామన్నపేట: కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని రామన్నపేటలోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో శనివారం నిర్వహించారు. తహసీల్దారు లాల్‌బహదూర్, ఎంపీడీవో యాకుబ్‌నాయక్ పాల్గొన్నారు.

భువనగిరి పట్టణం : కేంద్ర మాజీమంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. పురపాలక అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు పురపాలిక కార్యాలయ ఆవరణలో వెంకటస్వామి చిత్రపటానికి పుర అధ్యక్షురాలు గుర్రం కవిత పూలమాలలువేసి నివాళులర్పించారు.

సాధారణ ప్రసవాలు పెంచండి

బీబీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే సూచించారు. బీబీనగర్ మండలం కొండమడుగు ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఓపీ పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స వివరాలను రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అవసరమైన చోట ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. ఈ మాసంలో ప్రసవమయ్యే గర్భిణుల వివరాలను అడిగారు. సాధారణ ప్రసవం అయ్యేలా వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ముందుల నిల్వలు పరిశీలించారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రవణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొండమడుగు ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వలు పరిశీలిస్తున్న కలెక్టర్

అర్హులు ఓటర్లుగా నమోదు కావాలి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: అర్హులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య కోరారు. పట్టణంలోని పలు కళాశాలల్లో శనివారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలో భాగంగా ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యారంగం పరిరక్షణకు రాజీలేని పోరాటం చేసే అభ్యర్థిని సమష్టిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం పటిష్ఠ నాయకత్వంతోనే సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ బాలయ్య, కుమారస్వామి, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వాగత వేడుకలో విద్యార్థుల హంగామా

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: చైతన్య జూనియర్ కళాశాల స్వాగత వేడుక శనివారం పట్టణంలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. విద్యార్థులు ఆటాపాటలతో సందడి చేశారు. కళాశాల ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో జీవితంలో ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లేష్, కరస్పాండెంట్ ప్రవీణ్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఊరికి వెళ్లేవారు విధిగా సమాచారం ఇవ్వాలి

మోత్కూరు, న్యూస్‌టుడే: దసరా పండగకు ఇళ్లకు తాళాలు వేసి ఊరికి వెళ్లే ప్రజలు విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని మోత్కూరు ఎస్సై నాగరాజు కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద దొంగతనాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు నగలు, డబ్బు ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. బీరువా తాళం చెవులను దుస్తుల కింద, ఇంట్లో పెట్టుకోవద్దన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 100కు లేకుంటే సెల్‌ఫోన్ నెంబర్ 87126 67510కు ఫోన్ చేయాలని కోరారు.

సొంత నిధులతో ప్లాంట్‌కు మరమ్మతులు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం టంగుటూరులో ఆరు నెలలుగా మరమ్మతులకు నోచుకోక మూతపడిన వాటర్ ప్లాంట్‌ను గ్రామానికి చెందిన జూకంటి అనురాధ, అనిల్ దంపతులు సొంత నిధులతో మరమ్మతులు చేయించి ప్రజల దాహార్తిని తీర్చారు. రూ.50 వేలు ఖర్చుచేశారు. శనివారం గ్రామస్థుల సమక్షంలో వాటర్ ప్లాంట్‌ను తిరిగి ఉపయోగంలోకి తీసుకువచ్చారు. గ్రామస్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపి శాలువాలతో సన్మానించారు. మాజీ సర్పంచి కె.సమర సింహారెడ్డి, నీల రాములు, తదితరులు పాల్గొన్నారు.



వైకుంఠ ద్వారం వద్ద సంకీర్తనలు చేస్తున్న శ్రీ వెంకటేశ్వర భజన మండలి బృందం, భక్తులు

శతకోటి హరేరామ నామ జపం

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: రాజపేట మండలం రఘునాథపురానికి చెందిన శ్రీవేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో శనివారం యాదగిరిగుట్టలో శతకోటి హరేరామ నామ జప యజ్ఞం చేపట్టారు. యాదాద్రి గిరిప్రదక్షిణ చేపట్టి వైకుంఠద్వారం హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. రామ నామా మంత్రాన్ని జపిస్తూ ఈ మహాక్రతువులో తమ బృందంతో కలిసి భక్తులు విశేషంగా పాల్గొన్నారని బృంద నాయకుడు అదరాసు శ్రీధర్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో చిలక లక్ష్మీనారాయణ, వల్లకాటి బాబురావు, శ్రవణ్, ఈశ్వర్, శివరాజ్, రమేశ్, పరమేశ్, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు సర్వే పరిశీలన

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలం మహదేవపూర్‌లో జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వేను భువనగిరి ఆర్డీవో అమరేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, దండెం ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నజీర్, ఎంపీవో మజీద్, అనిత, పుణ్యవతి పాల్గొన్నారు.



డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో అమరేందర్‌రెడ్డి

పరిహారం చెల్లించాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు పరిహారం సంక్షేమ శాఖ ద్వారా చెల్లించాలని పీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సీస శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాదగిరిగుట్టలో పేయింటర్స్ సంఘం సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో కోట స్వామి, డి.యాదగిరి, యాకుబ్, ఇంద్రయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలోని 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతులు ఆదివారం చేయనున్నట్టు ఏఈ హరీశ్ తెలిపారు. ఆ ఉపకేంద్ర పరిధిలోని దేవలమ్మనాగారం, పీపల్‌పహాడ్, అల్లాపురం, ఏనెగండితండాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రకటించారు.

వడ్డెర మఠం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఆలేరు, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలోని వడ్డెర మఠం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేయాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డెర సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి శనివారం కొలనుపాకలోని వడ్డెర మఠాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ఉన్న 22 కులాలకు చెందిన మఠాలలో వడ్డెర మఠం ఒకటన్నారు. దశాబ్దాల కాలంగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. మఠం అభివృద్ధి విషయమై ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. సంఘం నాయకులు శివరాత్రి సురేష్, వల్లెపు అయిలయ్య, వల్లెపు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

రామన్నపేట, న్యూస్‌టుడే: వెల్లంకిలో మేకల నరేశ్ (38) జ్వరంతో శనివారం మృతి చెందటంతో ఈయన మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.మల్లయ్య తెలిపారు. కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్న నరేశ్ అయిదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఆకస్మాత్తుగా ఫిట్స్ రావటంతో నరేశ్ నురుగులు కక్కుతూ కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు డోరు తగిలి వృద్ధుడు..

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ శివారులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. పంతంగి గ్రామానికి చెందిన తుర్కపల్లి శంకరయ్య(65) పని నిమిత్తం చౌటుప్పల్‌కు వచ్చాడు. తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చౌటుప్పల్ శివారులోని వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద ఓ కారు ఆగి ఉన్నది. ఆ కారు డ్రైవర్ ఆకస్మాత్తుగా, నిర్లక్ష్యంగా డోరు తీయడంతో అతని ద్విచక్రవాహనం తగిలింది. దీంతో శంకరయ్య ఎగిరి జాతీయ రహదారిపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

తుర్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులు శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023-24లో రూ. 2,26,64,252 కోట్లు ఖర్చు చేసి 31 గ్రామ పంచాయతీలలో మొత్తం 437 పనులు చేపట్టారు. ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి డీఆర్డీఏ సురేశ్ హాజరయ్యారు. కార్యాలయం ఆవరణలో తనిఖీలు చేపట్టగా మధ్యాహ్నం వర్షం కురిసి అంతరాయం ఏర్పడింది. భోజన విరామం అనంతరం సమావేశ మందిరంలో తనిఖీ కొనసాగింది. సాయంత్రం వరకు 10 గ్రామ పంచాయతీలకు సంబంధించి సామాజిక తనఖీ చేపట్టారు. మోతీరాంతండాకు చెందిన క్షేత్ర సహాయకుడు భీమాను సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీలక్ష్మిబాయి, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో నర్సయ్య, తనిఖీ అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కనుల పండువగా దుర్గానవరాత్రి ఉత్సవాలు



వలిగొండ త్రిశక్తి ఆలయంలో అన్నపూర్ణదేవి రూపంలో అమ్మవార్లు

భువనగిరి : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆజాద్ రోడ్డులోని శ్రీరామ భక్తభజన మండలి వద్ద పూజల అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీహరిహర త్రిశక్తి ఆలయంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు, శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు అన్నపూర్ణ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాతకు పూజలు శనివారం నిర్వహించారు. భక్తులకు డా.శ్వేతప్రియాంక, సుధీర్ దంపతులు అన్నప్రసాదం వితరణ చేశారు.

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం ఇబ్రహింపురం గ్రామంలో రామాలయం వద్ద హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో ఎస్ఐ తక్యుద్దీన్ పూజలు చేశారు.

భువనగిరి గ్రామీణం: బీఎన్‌తిమ్మాపురంలో దుర్గామాత మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భువనగిరి : స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని వీరలక్ష్మీ స్వరూపిణిగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని మాడ వీధుల్లో ఊరేగించారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీమద్దెలమ్మ దేవి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. పురపాలిక ఛైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం పాల్గొన్నారు.



స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వీరలక్ష్మీ స్వరూపంలో పద్మావతి అమ్మవారు

పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా

బీబీనగర్, న్యూస్‌టుడే: ఇంటి ఆస్తి పన్నులను చెల్లించిన వారి వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీబీనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీనగర్ ఇందిరమ్మకాలనీ, లెప్రసీకాలనీ, రంగాపురంతో పాటు బీబీనగర్‌లో గత నాలుగైదేళ్లుగా ఇంటి పన్ను చెల్లించినా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా ఆఫ్‌లైన్‌లో నమోదు చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి సతీష్, దండెబోయిన శ్రీశైలం, నవీన్, సురేందర్, స్వప్న, రాజమ్మ, ముత్యాలమ్మ, దేవేందర్ సింగ్, మల్లమ్మ, లక్ష్మీ, రేణుక, ఎల్లమ్మ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



సంస్థాన్ నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు శనివారం ఘనంగా బతుకమ్మ సంబరాలను జరిపారు. ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం : యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ మంజుల, ఎన్ఎస్ఎస్ అధికారి రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

భువనగిరి పట్టణం : భువనగిరి పట్టణంలోని గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకను నిర్వహించారు. ప్రిన్సిపల్ మల్లేశం, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ పండుగ సంబురాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాతేశ్వరి, గ్రంథపాలకుడు మంగ్యానాయక్ పాల్గొన్నారు.

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, శ్రీగాయత్రి విద్యాసంస్థలో పూల పండుగ సందడి నెలకొంది.